

www.hamsakalam.com

PRGI: TGTEL/26/A3129

సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA

చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY   MEDCHAL /MALKAJGIRI   VOLUME:1   ISSUE:84   SATURDAY , AUGUST 08, 2026   PAGES:8   COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి   మేడ్చల్ /మల్కాజిగిరి   సంపుటి : 1   సంచిక : 84   శనివారం   08 ఆగష్టు   2026   పేజీలు :8   వెల: 4/-




## వర్షాల కోసం తెలంగాణ ప్రభుత్వం

# వరుణయాగం

- ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో వరుణయాగం
- యాగం నిర్వహించనున్న యాదగిరిగుట్ట ఆలయ వేద పండితులు, అర్చకులు
- పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొననున్న రేవంత్ రెడ్డి

హంసకాలం వార్త : రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి మిగతా 2లో





## భయపడొద్దు, నేనున్నాను

### “ టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

- ఎన్డీఏ కొత్త ఎంపీలతో ప్రధాని మోదీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్
- టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు అభయమిచ్చిన ప్రధాని
- “ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నాను” అంటూ భరోసా
- పార్లమెంటు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎంపీలకు సూచన

హంసకాలం వార్త : ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. “ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను” అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార మిగతా 2లో

# సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

- జాతీయ చేనేత దినోత్సవం వేళ రేవంత్‌కు కేటీఆర్ లేఖ
- నేతన్న బీమా, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలను ఆపేశారని మండిపాటు
- రద్దు చేసిన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్



హంసకాలం వార్త : జాతీయ చేనేత దినోత్సవం వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 2లో



## రూ.5 కోట్ల అంశానికి రూ.54 కోట్ల పెనాల్టీ పై మంత్రులు కోమటిరెడ్డి, వివేక్ ఆగ్రహం

- రోడ్ల నిర్మాణం, కాంట్రాక్టర్ల ఇబ్బందులపై ఉన్నత స్థాయి సమీక్ష
- కాంట్రాక్టర్ ఆత్మహత్యకు కారణమైన అధికారిపై చర్యలు తీసుకోవాలన్న కోమటిరెడ్డి
- కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని హెచ్చరిక

హంసకాలం వార్త : రోడ్డు పనులు చేపట్టే చిన్న కాంట్రాక్టర్లపై మైనింగ్ శాఖ అధికారులు పది రెట్ల వరకు అతిగా పెనాల్టీలు విధించడంపై రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సచివాలయంలో రహదారుల నిర్మాణం, కాంట్రాక్టర్ల మిగతా 2లో



## ‘యాక్సిడెంట్‌లా కనిపించేలా చంపెయ్’..

### ప్రియుడికి భార్య మెసేజ్‌లు చూసి భర్త షాక్

-హత్య చేసేందుకు భార్య కుట్ర పన్నిందని ఆరోపిస్తూ పోలీసులకు భర్త ఫిర్యాదు -భార్య మొబైల్‌లో చాటింగ్ ద్వారా బయటపడిందని ఆరోపణ -మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో ఘటన -చాటింగ్ స్క్రీన్‌షాట్లను పోలీసులకు సమర్పించిన బాధితుడు

# జన్మహక్కు పౌరసత్వం పై ట్రంప్ మరో కొరడా..

- జన్మహక్కు పౌరసత్వంపై ట్రంప్ రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకం
- నిర్దిష్ట పరిస్థితుల్లో వలస తల్లిదండ్రులకు పుట్టిన పిల్లలకు పౌరసత్వం నిరాకరణ
- ‘బర్త్ టూరిజం’ను అడ్డుకోవడమే లక్ష్యంగా రెండో ఉత్తర్వుల జారీ
- సుప్రీంకోర్టు తీర్పు తర్వాత పరిమిత అధికారాలతో కొత్త ఆదేశాలు

2



# హైదరాబాద్‌లో మరో భారీ బస్ డిపో

### 100 ఎకరాల్లో ప్లాన్ చేసిన ప్రభుత్వం.. కేంద్రమంత్రి గడ్కరీ ప్రకటన

- హైదరాబాద్‌లో ట్రాఫిక్ ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక
- గాజులరామారంలో 100 ఎకరాల్లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం
- హెచ్‌ఎంటీ స్థలం లీజు ప్రతిపాదన విఫలమవడంతో కొత్త నిర్ణయం నగరంలోకి రాకుండా అంతర్రాష్ట్ర బస్సుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు




హంసకాలం వార్త : హైదరాబాద్ నగరం లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమ స్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజుల రామా రంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించి నట్లు మిగతా 2లో

# చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



హంసకాలం వార్త : చేనేత కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. భారతీయ సంస్కృతికి, వారసత్వానికి మిగతా 2లో

# వర్షాల కోసం తెలంగాణ ప్రభుత్వం వరుణయాగం..



రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి, కృష్ణా-గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు 11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.

## రూ.5 కోట్ల అంశానికి రూ.54 కోట్ల పెనాల్టీపై మంత్రులు కోమటిరెడ్డి, వివేక్ ఆగ్రహం

రోడ్డు పనులు చేపట్టే చిన్న కాంట్రాక్టర్లపై మైనింగ్ శాఖ అధికారులు పది రెట్ల వరకు అతిగా పెనాల్టీలు విధించడంపై రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సచివాలయంలో రహదారుల నిర్మాణం, కాంట్రాక్టర్ల ఇబ్బందులపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో వారు మాట్లాడారు. రూ. 5 కోట్ల విలువైన అంశానికి ఏకంగా రూ. 54 కోట్లు పెనాల్టీ విధించడం అత్యంత దారుణమని, కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి వివేక్‌ను కోమటిరెడ్డి కోరారు. అక్రమ మైనింగ్ చేసేవారిని వదిలేసి, రోడ్ల పనులు చేసే అమాయక కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని మంత్రులు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హ్యామ్ మోడల్ రోడ్ల పనులను వేగవంతం చేసి, 2028 నాటికి రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్లు నిర్మించడమే లక్ష్యమని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మెటల్ పర్మిషన్ల పేరుతో వేధించవద్దని, కాంట్రాక్టర్ల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని మైనింగ్ శాఖ అధికారులను మంత్రి వివేక్ ఆదేశించారు.

# చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

భారతీయ సంస్కృతికి, వారసత్వానికి చేనేత ప్రతీక అని, గద్వాల, పోచంపల్లి, నారాయణపేట వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహి ంచాలని ఆయన పిలుపుని చ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నకు, నేతన్నకు సమాన ప్రాధాన్యతను ఇస్తోందని మంత్రి తెలిపారు. చేనేత రంగానికి ఇప్పటివరకు రూ. 980 కోట్లు విడుదల చేశామని, అందులో చేనేత రుణమాఫీ కింద రూ. 49.27 కోట్లు మంజూరు చేశామని వెల్లడిం చారు. 'నేతన్న భరోసా' ద్వారా ఏడాదికి రూ. 18,000 ఆర్థిక సాయం, 'నేతన్నకు భద్రత' కింద రూ. 5 లక్షల బీమా సౌకర్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని, ఐఐహెచ్‌టీ ద్వారా యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికలను నిర్వహిస్తామని, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో మరో భారీ బస్ డిపో

హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్‌ఆర్టీసీ గతంలో హెచ్‌ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని హెచ్‌ఎంటీ




అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ. 6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎస్‌ఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్‌ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎస్‌ఆర్టీసీకి కేటాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా నిర్మించనున్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు నగరం నడిబొడ్డుకు రాకుండా ఇక్కడి నుంచే తమ సర్వీసులను నడుపుతాయి. తద్వారా ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్లపై ఒత్తిడి తగ్గి, నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ప్రభుత్వం భావిస్తోంది.

# జన్మహక్కు పౌరసత్వంపై ట్రంప్ మరో కొరడా..

అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు. ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు), ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని యూఎస్ టెరిటరీలలో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఇక, రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న



'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక్'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

## భయపడొద్దు, నేనున్నాను

ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. "ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

జాతీయ చేనేత దినోత్సవం వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి గొప్ప పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి నేతన్నలను కోలుకోలేని దెబ్బతీసిందని తన లేఖలో ఆయన మండిపడ్డారు. బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫారాల తయారీ ఆర్డర్లను పక్కనబెట్టి, కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ. 18 వేల ఆర్థిక సాయం, రూ. లక్ష వ్యక్తిగత రుణమాఫీ, 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బోర్డులను రద్దు చేసి, జీఎస్టీ విధించి దెబ్బతీస్తే.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పథకాలను నిలిపివేసి నేతన్నలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కక్షపూరిత వైఖరి వీడి, రద్దు చేసిన పథకాలను తక్షణమే పునరుద్ధరించి నేతన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

## 'యాక్సిడెంట్‌లా కనిపించేలా చంపెయ్'..

తన జీవిత భాగస్వామే తన ప్రాణాలకు ముప్పుగా మారిందని ఓ భర్త చేసిన ఫిర్యాదు మహబూబాబాద్ జిల్లాలో కలకలం రేపింది. భార్య మొబైల్‌లో కనిపించిన వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ సందేశాలు చూసిన తర్వాత తనను హత్య చేయించే కుట్ర నడుస్తోందని అనుమానించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. అతను అందించిన చాటింగ్ వివరాల ఆధారంగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన గాదె రాజేశ్వరరావు ప్రస్తుతం ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. 2016లో సూర్యాపేట జిల్లా రాఘవాపురానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత నెల 27న మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వెళ్లిన సమయంలో భార్య మరో వ్యక్తితో చనువుగా ఉండటాన్ని గమనించినట్లు రాజేశ్వరరావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై పెద్దల సమక్షంలో మాట్లాడాలని నిర్ణయించి మరుసటి రోజు తన అన్నను తీసుకొచ్చేందుకు వెళ్లాడు. భార్యతో కనిపించిన వ్యక్తి ఆ సమయంలో తనను వెంబడించినట్లు గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేయగా అతను తప్పించుకుని వెళ్లిపోయాడని తెలిపాడు. అనుమానం మరింత పెరగడంతో భార్య మొబైల్‌ను పరిశీలించానని, అందులో ఉన్న చాటింగ్ చూసి షాక్‌కు గురయ్యానని రాజేశ్వరరావు చెప్పాడు. ఇంట్లో చంపొద్దని, బయట యాక్సిడెంట్‌గా కనిపించేలా హత్య చేయాలని భార్య, ఆమెకు పరిచయం ఉన్న పురిమెట్ల సైదులుకు పలుమార్లు మెసేజ్‌లు పంపినట్లు ఆరోపించాడు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో జరిగిన సంభాషణల స్క్రీన్‌షాట్లను కూడా పోలీసులకు సమర్పించాడు. భార్య, ఆమెతో సన్నిహితంగా ఉన్న వ్యక్తి కలిసి తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ ఈ నెల 1న డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. తాజాగా బాధితుడు ఖమ్మం రూరల్ పోలీసులను మరోసారి కలిసి పూర్తి వివరాలు అందించాడు.

హంస కలం వార్త



# సంపాదకీయం

## భావవిప్లవానికి మానవవాద బాట



జాతి, కుల, మత, వర్గ, లింగాది భేదాలను పాటించకుండా మనుషులందరినీ సమానులుగా, ఎవరి చర్యలకు వారే బాధ్యులుగా, ఎవరి భవితవ్యానికి వారే నిర్మాతలుగా పరిగణించేదే మానవవాదం. వ్యక్తికి ప్రథమ స్థానాన్నిచ్చి, స్వేచ్ఛగా, హుందాగా జీవించే మానవ హక్కును గుర్తించే తత్వమే మానవవాదం. మానవుడే అన్నిటికీ ప్రమాణమనేది దాని మౌలిక సూత్రం.మానవుడెంత ప్రాచీనుడో మానవవాదం కూడా అంత ప్రాచీనమైనది. భారతదేశంలో ప్రాచీనకాలంలో వర్ధిల్లిన చార్వాక, జైన, బౌద్ధాది భావోద్యమాలన్నీ భౌతికవాద, మానవవాద భావాలతో కూడుకొన్నవే. ప్రాచీన కాలంలోని భారతీయ తాత్విక భావజాలమంతా ఆస్తికవాద, ఆధ్యాత్మికవాద భావజాలమేనని అందరూ భావిస్తున్నారు. కానీ అది నిజం కాదు. ప్రాచీనకాలంలో అమలులో ఉన్న అరవై తాత్విక సిద్ధాంతాలలో ఒక్క వేదాంతం తప్ప మిగతావన్నీ భౌతికవాద, నాస్తికవాద తాత్విక సిద్ధాంతాలేనని తత్వశాస్త్ర చరిత్రకారుడు దేవీ ప్రసాద్ ఛటోపాధ్యాయ తెలిపారు.

ఎం.ఎన్.రాయ్‌గా ప్రసిద్ధి చెందిన మానవేంద్రనాథ్ రాయ్ తీవ్ర జాతీయవాదిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, అంతర్జాతీయ కమ్యూనిస్టు నాయకుడిగా ఎదిగి, చివరకు పరిపక్వత చెందిన రాడికల్ హ్యూమనిస్టు తత్వవేత్తగా రూపాంతరం చెందాడు. 1848లో కమ్యూనిస్టు మ్యానిఫెస్టో విడుదల కాగా, వంద సంవత్సరాల తరువాత 1947లో రాడికల్ హ్యూమనిస్టు మ్యానిఫెస్టోను రాయ్ విడుదల చేశాడు. మానవవాద భావాలకు సమగ్రమైన రూపాన్నిస్తూ తన సిద్ధాంతాన్ని 22 సూత్రాల రూపంలో ప్రతిపాదించాడు. వాటిలో మొదటి ఆరు సూత్రాలు ఆధునిక విజ్ఞానశాస్త్ర రీత్యా రాడికల్ హ్యూమనిజం ప్రతిపాదించే తాత్విక భావాలను తెలియజేస్తాయి. ఆ తరువాతి ఎనిమిది సూత్రాలు కాలం చెల్లిపోయిన రాజకీయార్థిక సిద్ధాంతాలలోని లోపాలను విశ్లేషించి వివరిస్తాయి. చివరి ఎనిమిది సూత్రాలు హ్యూమనిస్టు రాజకీయార్థిక సామాజిక నిర్మాణాన్ని ప్రతిపాదిస్తాయి. అనేక దేశాలలో హ్యూమనిస్టు భావజాలం ప్రచారంలో ఉన్నప్పటికీ అవన్నీ కేవలం తాత్విక భావాలకో, లౌకిక భావాలకో పరిమితమైపోయి ఉన్నందువల్ల రాయ్ తాను ప్రతిపాదించిన హ్యూమనిజానికి సమగ్రమైన రూపాన్నిచ్చాడు. అందుకే దానికి రాడికల్ హ్యూమనిజమని, న్యూ హ్యూమనిజమని పేరు పెట్టాడు.మానవుడు ప్రకృతిలో అవిభాజ్యమైన భాగం. ప్రకృతిలోని నియమశీలత పరిణామక్రమంలో జీవజాతుల్లో ప్రవేశించింది. దాన్నే మనం హేతుత్వం అంటున్నాం. అది వృక్షజాతుల్లో సహజాత రూపంలోను, మానవుడిలో విచక్షణ రూపంలోను దర్శనమిస్తుంది. ఆ హేతుత్వం ఆధారంగానే మానవుడు ప్రకృతిని పరిశీలించి, పరిశోధించి, అనుభవపూర్వకంగా అనేక విషయాలను అర్థం చేసుకుని జ్ఞానార్జన చేస్తున్నాడు. జ్ఞానతృష్ణతో, సత్యాన్వేషణాసక్తితో, స్వేచ్ఛాపిపాసతో మానవుడు చేసేదంతా తన మనుగడకు, భవితవ్యానికి ఉన్న సంబంధాన్ని తెలుసుకోవడమే. ప్రతిదానికీ ఒక కారణం ఉంటుందనే భావనే శాస్త్రానికి, తత్వానికి పునాదిగా నిలిచింది.

నేడు భారత సమాజమంతా వేలాది మూఢవిశ్వాసాల ఊబిలో చిక్కుకుపోయి ఉంది. సనాతనధర్మం పేరిట, సంప్రదాయాల పేరిట తరతరాలుగా మూఢ విశ్వాసాలను సమర్థిస్తూ, ఆచరిస్తూ వస్తున్నాం. దేవుడి పేరుతో, మతం పేరుతో దోపిడీ కొనసాగుతూనే ఉంది. అవినీతికి ఆలవాలమైన రాజకీయ పార్టీలు దేవుడిని, మతాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నాయి. వేలాది సంవత్సరాలుగా శాంతియుతంగా సహజీవనం సాగిస్తున్న భిన్న మతస్థుల మధ్య చిచ్చు పెడుతున్నాయి. వ్యక్తులే సమాజ నిర్మాతలు. వ్యక్తులు లేకుండా సమాజానికి అస్తిత్వం ఉండదు. అందువల్ల వ్యక్తుల అభివృద్ధే సమాజాభివృద్ధికి మూలమవుతుంది. అందుకే మానవవాదం వ్యక్తివాదాన్ని ప్రతిపాదిస్తుంది. సమష్టి మిథ్యావాదాలు సమాజానికి హానికరంగా తయారయ్యాయి. కులం, మతం, వర్గం, జాతి, పార్టీ వంటి వాటికి అధిక ప్రాధాన్యమిస్తూ వ్యక్తిని పూర్తిగా విస్మరిస్తున్నారు. చాలా సందర్భాల్లో సమష్టి కోసం వ్యక్తులను బలిచేస్తున్నారు. వాస్తవానికి సమష్టి సిద్ధాంతాలన్నీ మిథ్యగా మిగిలిపోతున్నాయి.

వర్తమాన దేశ పరిస్థితులు అత్యంత భయానకంగా తయారయ్యాయి. ఒకవైపు అసమానతలకు, దోపిడీకి ఆలవాలంగా ఉన్న సనాతన ధర్మాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నాలు జోరుగా కొనసాగుతున్నాయి. మరోవైపు ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి మార్గదర్శకంగా ఉన్న రాజ్యాంగంపై దాడి తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. స్వతంత్రంగా కొనసాగవలసిన రాజ్యాంగ సంస్థలైన ఎన్నికల సంఘం, సీబీఐ వంటి వాటిని పాలకపార్టీ లోబరచుకుని తన నియంతృత్వ విశ్వరూపాన్ని ప్రదర్శిస్తోంది. ప్రశ్నించే వారిని, ఎదిరించేవారిని అణగదొక్కి వారిపై అక్రమ కేసులు బనాయిస్తోంది. హింసాత్మక విధానాలకు పాల్పడుతోంది. ఇటువంటి విపత్కర పరిస్థితుల నుంచి బయటపడడానికి హేతువాద, మానవవాద భావవిప్లవమే శరణ్యం.

# క్లిక్‌ల వెనుక కన్నీళ్లు...

## ఫోటోగ్రాఫర్ల జీవితాన్ని మార్చేసిన స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియా, ఏ ఐ విప్లవం”

ఫోటోగ్రఫీ స్వర్ణయుగం, స్టూడియోల వైభవం, స్మార్ట్‌ఫోన్ ప్రభావం ఒకప్పుడు ఫోటోగ్రఫీ అంటే ఒక కళ, ఒక వృత్తి, ఒక జ్ఞాపకం. ప్రతి ఇంట్లో జరిగే శుభకార్యం, పెళ్లి, పుట్టినరోజు, విద్యార్థుల గ్రూప్ ఫోటోలు, కుటుంబ వేడుకలు అన్నీ ఫోటోగ్రాఫర్ కెమెరా క్లిక్‌తోనే శాశ్వత జ్ఞాపకాలుగా మారేవి. ఆ కాలంలో ఫోటో స్టూడియోలు ప్రతి పట్టణంలో, ప్రతి ప్రధాన వీధిలో ఉండేవి. ఒక మంచి ఫోటో కోసం ప్రజలు ప్రత్యేకంగా స్టూడియోకు వెళ్లి ఫోటోలు తీయించుకునేవారు. స్టూడియోలో అందమైన బ్యాక్‌డ్రాప్‌లు, ప్రత్యేక లైటింగ్, ప్రొఫెషనల్ కెమెరాలు, ఫిల్మ్ రోల్స్, డార్క్‌రూమ్‌లో ఫోటోలను డెవలప్ చేసే ప్రక్రియ అన్నీ ఒక ప్రత్యేక అనుభూతిని కలిగించేవి. ఫోటోగ్రాఫర్ నైపుణ్యం, అనుభవం, ఓపికతో తీసిన ప్రతి చిత్రం ఒక కళాఖండంగా నిలిచేది. కాలక్రమేణా డిజిటల్ కెమెరాలు వచ్చాయి. ఫిల్మ్ రోల్స్ స్థానంలో మెమరీ కార్డులు వచ్చాయి. ఫోటోలు వెంటనే చూడగలిగే అవకాశం రావడంతో ఫోటోగ్రఫీ మరింత వేగవంతమైంది. అయినప్పటికీ స్టూడియోల ప్రాధాన్యం తగ్గలేదు. పాస్‌పోర్ట్ ఫోటోలు, వెడ్డింగ్ షూట్లు, ఫ్యామిలీ పోర్ట్రెట్లు, ఆల్బమ్‌లు వంటి సేవలకు ప్రజలు స్టూడియోలనే ఆశ్రయించేవారు. కానీ స్మార్ట్‌ఫోన్‌ల విప్లవం ఫోటోగ్రఫీ రంగాన్ని పూర్తిగా మార్చేసింది. ప్రతి ఒక్కరి చేతిలో అత్యాధునిక కెమెరా ఉన్న ఫోన్ ఉండటంతో చిన్నచిన్న అవసరాలకు స్టూడియోలకు వెళ్లే అవసరం దాదాపు తగ్గిపోయింది. సెల్ఫీలు, సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు, రీల్స్--- అన్నీ మొబైల్‌లోనే సాధ్యమయ్యాయి. ఫోటో తీసిన వెంటనే ఎడిట్ చేసి ప్రపంచంతో పంచుకునే సౌకర్యం రావడంతో సంప్రదాయ స్టూడియోలపై తీవ్ర ప్రభావం పడింది.

ఒకప్పుడు వందలాది స్టూడియోలు కళకళలాడిన ప్రాంతాల్లో నేడు చాలా స్టూడియోలు మూతపడిన పరిస్థితి కనిపిస్తోంది. అనేక మంది ఫోటోగ్రాఫర్లు వృత్తిని మార్చుకోవాల్సి వచ్చింది. కొందరు ఈవెంట్ ఫోటోగ్రఫీ, వెడ్డింగ్ సినిమాటోగ్రఫీ, డ్రోన్ ఫోటోగ్రఫీ, సోషల్ మీడియా కంటెంట్ క్రియేషన్ వంటి కొత్త రంగాల్లో అవకాశాలను వెతుక్కుంటున్నారు.

అయితే స్మార్ట్‌ఫోన్ కెమెరా ఎంత అభివృద్ధి చెందినా, ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ కళాత్మక దృష్టి, అనుభవం, సరైన లైటింగ్, కాంపోజిషన్, భావోద్వేగాలను బంధించే నైపుణ్యానికి ప్రత్యామ్నాయం కాదు. పెళ్లిళు ,, పెద్ద ఈవెంట్లు, వాణిజ్య ప్రకటనలు, ఫ్యాషన్, వన్యప్రాణులు, జర్నలిజం వంటి రంగాల్లో ఇప్పటికీ ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ల అవసరం ఎంతో ఉంది.

ప్రస్తుత పరిస్థితుల్లో ఫోటోగ్రాఫర్లు కూడా కాలానికి అనుగుణంగా మారాలి. ఆధునిక సాంకేతికతను నేర్చుకోవడం, డ్రోన్‌లు, వీడియో ఎడిటింగ్, AI ఆధారిత ఫోటో ఎడిటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్ వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.

ఫోటోగ్రఫీ స్వర్ణయుగం జ్ఞాపకాలలో నిలిచిపోయినా, ఈ కళకు భవిష్యత్తు లేదని చెప్పలేం. కాలం మారింది, అవసరాలు మారాయి, పరికరాలు మారాయి. కానీ మన జీవితంలోని విలువైన క్షణాలను శాశ్వతంగా నిలిపే ఫోటోగ్రఫీ కళ మాత్రం ఎప్పటికీ చిరస్థాయిగానే ఉంటుంది.

ఫోటోగ్రాఫర్ల ఆర్థిక ఇబ్బందులు, నిజజీవిత పరిస్థితులు, AI, సోషల్ మీడియా ప్రభావం

“ఒక ఫోటో వెయ్యి మాటలకు సమానం” అంటారు. కానీ ఆ ఒక్క ఫోటో వెనుక ఉన్న ఫోటోగ్రాఫర్ జీవితం మాత్రం నేడు ఎన్నో సవాళ్లతో నిండి ఉంది. ఒకప్పుడు సమాజంలో గౌరవప్రదమైన వృత్తిగా గుర్తింపు పొందిన ఫోటోగ్రఫీ రంగం, నేడు సాంకేతిక విప్లవం, స్మార్ట్‌ఫోన్‌ల విస్తరణ, సోషల్ మీడియా ప్రభావం, కృత్రిమ మేధస్సు అభివృద్ధితో పూర్తిగా మారిపోయింది.

ఒకప్పుడు ప్రతి ఊరిలో, ప్రతి కాలనీలో ఫోటో స్టూడియోలు కళకళలాడేవి. పాస్‌పోర్ట్ ఫోటో నుంచి పెళ్లిళ్లు, శుభకార్యాలు, కుటుంబ ఫోటోలు వరకు ప్రతి అవసరానికి ప్రజలు స్టూడియోలనే ఆశ్రయించేవారు. ఫోటోగ్రాఫర్ అనుభవం, నైపుణ్యం, కళాత్మక దృష్టి ఎంతో విలువైనవిగా భావించబడేవి.

అయితే నేడు పరిస్థితి పూర్తిగా మారింది. ప్రతి ఒక్కరి చేతిలో అధిక నాణ్యత గల కెమెరా ఉన్న స్మార్ట్‌ఫోన్ ఉండటంతో సాధారణ ఫోటోగ్రఫీ అవసరాలకు స్టూడియోలపై ఆధారపడటం గణనీయంగా తగ్గింది. సెల్ఫీలు, మొబైల్ ఫోటోలు, తక్షణ ఎడిటింగ్, సోషల్ మీడియాలో వెంటనే పంచుకోవడం వంటి అలవాట్లు సంప్రదాయ ఫోటోగ్రఫీ రంగాన్ని ప్రభావితం చేశాయి.

ఇది ఫోటోగ్రాఫర్ల ఆదాయంపైనా ప్రత్యక్ష ప్రభావం చూపింది. ఒకప్పుడు నెలలో అనేక కార్యక్రమాలకు వెళ్లి మంచి ఆదాయం పొందిన ఫోటోగ్రాఫర్లు,



ఇప్పుడు సీజన్ ఉన్నప్పుడే పని దొరికే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. స్టూడియో అద్దె, విద్యుత్ బిల్లులు, ఉద్యోగుల జీతాలు, కెమెరాలు, లెన్స్‌లు, కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్ లైసెన్స్‌లు వంటి ఖర్చులు పెరుగుతుండగా, ఆదాయం మాత్రం అనిశ్చితంగా మారింది.

మరోవైపు సోషల్ మీడియా కూడా ఈ రంగాన్ని మార్చింది. చాలా మంది తక్కువ ధరకు లేదా ఉచితంగానే ఫోటోషూట్లు చేస్తూ తమ పేరును సంపాదించాలనే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల వృత్తిపరమైన సేవలకు తగిన విలువ, పారితోషికం తగ్గుతున్నట్లు అనేక మంది ఫోటోగ్రాఫర్లు భావిస్తున్నారు. అదే సమయంలో సోషల్ మీడియా ద్వారా తమ ప్రతిభను ప్రపంచానికి చూపించి కొత్త అవకాశాలు పొందుతున్న ఫోటోగ్రాఫర్లు కూడా ఉన్నారు. అంటే ఇది ఒక సవాలే కాకుండా అవకాశాల వేదిక కూడా.

ఇటీవలి కాలంలో ూ× (కృత్రిమ మేధస్సు) రాకతో మరో కొత్త మార్పు ప్రారంభమైంది. కొన్ని నిమిషాల్లోనే ూ× సహాయంతో ఫోటోలను మెరుగుపరచడం, నేపథ్యాలను మార్చడం, పాత ఫోటోలను పునరుద్ధరించడం, డిజైన్‌లు రూపొందించడం వంటి పనులు సులభమయ్యాయి. దీంతో కొన్ని సంప్రదాయ సేవలపై డిమాండ్ తగ్గే అవకాశం ఉంది. అయితే ూ× ఒక సాధనం మాత్రమే; ఒక సంఘటనలోని భావోద్వేగాన్ని, సరైన క్షణాన్ని, వెలుతురును, మానవ సంబంధాలను కెమెరాలో బంధించే సృజనాత్మకత మాత్రం ఇప్పటికీ ఫోటోగ్రాఫర్‌దే.

అందువల్ల ూ×ను శత్రువుగా కాకుండా, పనిని వేగవంతం చేసే సహాయక సాధనంగా ఉపయోగించుకోవడం నేటి అవసరం. ఫోటోగ్రాఫర్లు వీడియో నిర్మాణం, డ్రోన్ ఫోటోగ్రఫీ, సినిమాటిక్ వెడ్డింగ్‌లు, కార్పొరేట్ కంటెంట్, ఉత్పత్తుల ఫోటోగ్రఫీ, సోషల్ మీడియా కంటెంట్ తయారీ వంటి కొత్త రంగాల్లో తమ నైపుణ్యాన్ని విస్తరించుకుంటే మరిన్ని అవకాశాలు పొందవచ్చు.

నిజజీవితంలో అనేక మంది ఫోటోగ్రాఫర్లు అప్పులు చేసి ఖరీదైన పరికరాలు కొనుగోలు చేస్తున్నారు. కానీ సంవత్సరం పొడవునా స్థిరమైన పని లేకపోవడం, పెరుగుతున్న పోటీ, తక్కువ ధరలకు సేవలు ఇవ్వాల్సిన పరిస్థితి, చెల్లింపుల్లో ఆలస్యం వంటి సమస్యలు వారి కుటుంబాలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. అనేక చిన్న స్టూడియోలు మూతపడగా, మరికొన్ని కేవలం గుర్తింపు ఫోటోలు లేదా చిన్నచిన్న సేవలకే పరిమితమయ్యాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం, ఫోటోగ్రాఫర్ల సంఘాలు, ఆర్థిక సంస్థలు కలిసి ఈ రంగానికి శిక్షణ, తక్కువ వడ్డీ రుణాలు, డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధి, సామాజిక భద్రత వంటి అంశాల్లో సహకారం అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అదే సమయంలో వినియోగదారులు కూడా నాణ్యమైన వృత్తిపరమైన సేవలకు తగిన విలువ ఇవ్వడం అవసరం.

సాంకేతికత మారుతుంది. పరికరాలు మారుతాయి. కానీ జీవితంలోని అమూల్యమైన క్షణాలను శాశ్వతంగా నిలిపే కళ మాత్రం మారదు. ఆ కళ వెనుక ఉన్న ఫోటోగ్రాఫర్ కృషిని గౌరవించడం, వారి వృత్తికి తగిన గుర్తింపు ఇవ్వడం సమాజ బాధ్యత. AI, స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా ఎంత అభివృద్ధి చెందినా, మానవ అనుభూతిని కళాత్మకంగా బంధించే ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్‌కు ప్రత్యేక స్థానం ఎప్పటికీ ఉంటుంది.

పరిష్కారాలు, నిపుణుల అభిప్రాయాలు, భవిష్యత్తు అవకాశాలు, ముగింపు

పరిష్కారాలు

ఫోటోగ్రఫీ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించాలంటే ఫోటోగ్రాఫర్లు, ప్రభుత్వం, ఫోటోగ్రాఫర్ల సంఘాలు, శిక్షణ సంస్థలు, వినియోగదారులు అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

-ఆధునిక నైపుణ్యాలపై శిక్షణ: ూ× ఆధారిత ఫోటో ఎడిటింగ్, వీడియో ప్రొడక్షన్, డ్రోన్ ఫోటోగ్రఫీ, సినిమాటోగ్రఫీ, సోషల్ మీడియా కంటెంట్ క్రియేషన్ వంటి రంగాల్లో నిరంతర శిక్షణ పొందాలి.

-డిజిటల్ మార్కెటింగ్: ప్రతి ఫోటోగ్రాఫర్ తన పనిని వెబ్‌సైట్, సోషల్ మీడియా పేజీలు, ఆన్‌లైన్ పోర్ట్‌ఫోలియో ద్వారా విస్తృతంగా ప్రచారం చేసుకోవాలి.

-ప్రభుత్వ సహాయం: చిన్న స్టూడియోల కోసం తక్కువ వడ్డీ రుణాలు, పరికరాల కొనుగోలుకు సబ్సిడీలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, బీమా పథకాలు వంటి చర్యలు ఉపయోగపడతాయి.

-వృత్తిపరమైన ప్రమాణాలు: ఫోటోగ్రాఫర్ల సంఘాలు కనీస సేవా రుసుములు, నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పిస్తే అనారోగ్యకరమైన ధరల పోటీ తగ్గే అవకాశం ఉంటుంది.

-ప్రత్యేకతను పెంపొందించడం: వెడ్డింగ్‌లు, బేబీ ఫోటోగ్రఫీ, ఫుడ్, ఫ్యాషన్, వన్యప్రాణులు, కార్పొరేట్, స్పోర్ట్స్, ప్రొడక్ట్ ఫోటోగ్రఫీ వంటి ప్రత్యేక రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన అవకాశాలు లభిస్తాయి.

నిపుణుల అభిప్రాయాలు

ఫోటోగ్రఫీ నిపుణుల అభిప్రాయం ప్రకారం, సాంకేతికతను అడ్డంకిగా కాకుండా అవకాశంగా చూడాలి. ూ× అనేక పనులను వేగవంతం చేయగలదు. అయితే సరైన క్షణాన్ని గుర్తించడం, భావోద్వేగాన్ని బంధించడం, వెలుతురు--నీడల సమతుల్యతను సృజనాత్మకంగా వినియోగించడం, కథ చెప్పే దృశ్యాలను రూపొందించడం వంటి అంశాలు ఇప్పటికీ మానవ నైపుణ్యంపైనే ఆధారపడి ఉంటాయి.

అనుభవజ్ఞులైన ఫోటోగ్రాఫర్లు చెప్పే ముఖ్యమైన సూచన ఏమిటంటే---“కెమెరా ఖరీదు కాదు, దాన్ని ఉపయోగించే వ్యక్తి దృష్టి, సృజనాత్మకత, అనుభవమే గొప్ప ఫోటోను సృష్టిస్తాయి.”

భవిష్యత్తు అవకాశాలు

ఫోటోగ్రఫీ రంగం మారుతోంది కానీ అంతరించిపోవడం లేదు. కొత్త అవకాశాలు నిరంతరం వస్తున్నాయి.

-వెడ్డింగ్ సినిమాటోగ్రఫీ
-డ్రోన్ ఫోటోగ్రఫీ మరియు ఏరియల్ వీడియోలు
-డిజిటల్ మార్కెటింగ్ కోసం బ్రాండ్ కంటెంట్
-ఈ-కామర్స్ ఉత్పత్తుల ఫోటోగ్రఫీ
-రియల్ ఎస్టేట్ మరియు ఇంటీరియర్ ఫోటోగ్రఫీ
-ట్రావెల్, టూరిజం, వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రఫీ
-సోషల్ మీడియా కంటెంట్ నిర్మాణం
- AI ఆధారిత ఫోటో రిస్టోరేషన్ మరియు క్రియేటివ్ ఎడిటింగ్

ఈ రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకున్న వారికి దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా అవకాశాలు పెరుగుతున్నాయి.

ముగింపు

ఫోటోగ్రఫీ అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు; అది చరిత్రను, సంస్కృతిని, కుటుంబ జ్ఞాపకాలను, సమాజంలోని భావోద్వేగాలను తరతరాలకు అందించే కళ. కాలం మారింది, సాంకేతికత మారింది, కెమెరాలు మారాయి. కానీ జీవితంలోని అమూల్యమైన క్షణాలను శాశ్వతంగా నిలిపే అవసరం మాత్రం ఎప్పటికీ మారదు.

AI, స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా ఫోటోగ్రఫీ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినా, సృజనాత్మక దృష్టి, మానవ అనుభూతి, వృత్తిపరమైన నిబద్ధతకు ప్రత్యామ్నాయం కాలేవు. మార్పులను స్వీకరిస్తూ, కొత్త నైపుణ్యాలను అలవర్చుకుంటూ ముందుకు సాగిన ఫోటోగ్రాఫర్లదే రేపటి విజయం.

ఫోటోగ్రాఫర్ తీసేది కేవలం ఒక చిత్రం కాదు--- ఒక కుటుంబం చిరునవ్వును, ఒక తల్లి ఆనందాన్ని, ఒక పెళ్లి జ్ఞాపకాన్ని, ఒక సమాజ చరిత్రను, ఒక తరానికి గుర్తుండిపోయే క్షణాన్ని. అందుకే ఫోటోగ్రఫీ కళ చిరస్థాయిగా నిలుస్తుంది. ఆ కళాకారుడికి తగిన గౌరవం, ఆదరణ, అవకాశాలు కల్పించడం సమాజం, ప్రభుత్వం, పరిశ్రమ, వినియోగదారులందరి బాధ్యత.



✍✍ ప్రత్యేక విశ్లేషణ: వి. విష్ణుమూర్తి

## కేపీహెచ్‌బీ పోలీసులు మొబైల్ ఫోన్ దొంగను అరెస్ట్ చేసి చోరీకి గురైన ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు

( ఆగస్టు - 7- హంస కలంవార్త )

పోలీస్ స్టేషన్: కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్, సైబరాబాద్ కమిషనరేట్ కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మొబైల్ ఫోన్ చోరీ కేసును పోలీసులు త్వరితగతిన ఛేదించి, ఒక అలవాటైన మొబైల్ ఫోన్ దొంగను అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుండి సుమారు రూ.80,000 విలువైన ఒక ాాజూజూాశ్రీవ ఘ్రూష్ట్రశీఅవ 16 ాశ్రీబం మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో విశ్వసనీయ సమాచారం మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు నిందితుడిని లులు మాల్ పరిసర ప్రాంతంలో అదుపులోకి తీసుకుని విచారించగా, అతడు నేరాన్ని అంగీకరించాడు. అనంతరం అతని వద్ద నుండి చోరీకి గురైన మొబైల్ ఫోన్‌ను చట్టపరమైన పంచనామా ద్వారా స్వాధీనం చేసుకున్నారు.

**నిందితుడి వివరాలు**

పేరు: అందే వెంకట రమణ వయస్సు: 40 సంవత్సరాలు వృత్తి: కూలీ ప్రస్తుతం నివాసం: గాంధీ ఆసుపత్రి ప్రాంగణం సమీపంలోని ఫుట్‌పాత్, సికింద్రాబాద్. పోలీసుల విచారణలో నిందితుడు గతంలో కూడా ఇలాంటి మొబైల్ ఫోన్ చోరీ కేసులో




అరెస్టయిన అలవాటైన నేరస్థుడని వెల్లడైంది. స్వాధీనం చేసిన ఆస్తి Apple iPhone 16 Plus మొబైల్ ఫోన్ సుమారు విలువ: రూ.80,000/- ప్రజలకు కేపీహెచ్‌బీ పోలీసుల విజ్ఞప్తి ప్రజలు షాపింగ్ మాల్స్, మార్కెట్లు, బస్ స్టాండ్లు, మెట్రో స్టేషన్లు, జాతరలు మరియు ఇతర రద్దీ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి. మొబైల్ ఫోన్, పర్స్ వంటి విలువైన వస్తువులను జిప్ ఉన్న బ్యాగ్ లేదా సురక్షితమైన జేబులో ఉంచుకోవాలి. రద్దీ ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తుల కదలికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి. విలువైన వస్తువులను నిర్లక్ష్యంగా వదిలివేయకూడదు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే చేయాల్సినవి వెంటనే CEIR (Central Equipment Identity Register) పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసి మొబైల్ IMEI నంబర్‌ను బ్లాక్ చేయించాలి. సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా డయల్-112 ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాలి. మొబైల్‌లో ఉన్న డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు, UPI, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లు మరియు డిజిటల్ వాలెట్ సేవలను వెంటనే బ్లాక్ చేయించాలి, తద్వారా సైబర్ మోసాలను నివారించవచ్చు. ఈ-మెయిల్, బ్యాంకింగ్, సోషల్ మీడియా మరియు ఇతర ముఖ్యమైన ఖాతాల పాస్‌వర్డులను వెంటనే మార్చుకోవాలి. సంబంధిత మొబైల్ సేవా సంస్థకు సమాచారం ఇచ్చి SIM కార్డును వెంటనే బ్లాక్ చేయించాలి. ప్రతి మొబైల్ ఫోన్ పోయిన లేదా చోరీకి గురైన ఘటనను తప్పనిసరిగా పోలీసులకు మరియు CEIR పోర్టల్‌లో నమోదు చేయాలని కేపీహెచ్‌బీ పోలీసులు ప్రజలను కోరుతున్నారు. సమయానికి ఫిర్యాదు చేయడం ద్వారా మొబైల్ ఫోన్‌ను గుర్తించే అవకాశాలు పెరగడంతో పాటు, సైబర్ మోసాలను కూడా నివారించవచ్చు. -ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ సైబరాబాద్ కమిషనరేట్

# టీడీఆర్ పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి వేగం

(ఆగస్టు - 7 - హంసకాలం వార్త )

భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి: కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి మల్కాజిగిరి, ఆగస్టు 7: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. తార్నాకలోని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో టీడీఆర్ దరఖాస్తులు, భూసేకరణ ప్రక్రియ, పెండింగ్ కేసుల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరాభివృద్ధి ప్రాజెక్టులు నిర్దేశిత గడువులో పూర్తికావాలంటే భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల కల్పన వంటి ప్రజాప్రయోజన



ప్రాజెక్టులకు అవసరమైన భూముల సేకరణలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. టీడీఆర్‌కు సమ్మతి తెలిపిన భూ యజమానులకు అనవసర ఆలస్యం లేకుండా టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ చేయాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలన, సాంకేతిక అనుమతులు, పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేసి పెండింగ్ కేసులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. టీడీఆర్ జారీ ప్రక్రియలో పారదర్శకత, సమర్థత పాటిస్తూ ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పూర్తి చేయాలని,



సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పెండింగ్ కేసులను గణనీయంగా తగ్గించాలని కమిషనర్ సూచించారు. భూసేకరణ, టీడీఆర్ జారీ ప్రక్రియలు వేగవంతం కావడం ద్వారా అభివృద్ధి పనులు సకాలంలో పూర్తవడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, అదనపు చీఫ్ సిటీ ప్లానర్ రంజిత్ కుమార్, ల్యాండ్ అక్విజిషన్ ఆఫీసర్ సరితతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మహిళతో దురుసు ప్రవర్తన?.. సీనియర్ పాత్రికేయుడిపై పోలీసులకు ఫిర్యాదు

( ఆగస్టు - 7- హంస కలంవార్త )

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని సాయినగర్‌లో ఓ మహిళతో దురుసుగా ప్రవర్తించాడనే ఆరోపణలతో ప్రముఖ దినపత్రికకు చెందిన ఓ సీనియర్ పాత్రికేయుడిపై పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు, బాధిత మహిళ, ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం,బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. తమ ఇంటి ప్రహరీ గోడకు ఆనుకుని నివసిస్తున్న సదరు పాత్రికేయుడు, అతని భార్య గత ఏడాది కాలంగా తరచూ తమ ఇంటి వద్ద చెత్తాచెదారం వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు,ఈ విషయమై పలుమార్లు చెప్పినా వారి ప్రవర్తన మార్చుకోలేదని పేర్కొన్నారు,ఇటీవల మరోసారి చెత్త వేయడాన్ని సదరు పాత్రికేయుడు అతని భార్యను ప్రశ్నించగా మహిళను అసభ్య పదజాలంతో దూషిస్తూ దురుసుగా ప్రవర్తించడమే




కాకుండా, ఆమె వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగేలా నిరాధార ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు, అంతేకాకుండా ఆమె భర్తను సైతం బెదిరించారని ఆరోపించారు, మహిళ అని కూడా చూడకుండా అవమానకరంగా వ్యవహరించడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యామని, తమకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు ప్రాథమిక విచారణ ప్రారంభించినట్లు తెలిసింది, ఇదిలా ఉండగా సదరు సీనియర్ పాత్రికేయుడు కూడా బాధితులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం, దీంతో ఇరు వర్గాల వాదనలు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది,ఈ ఘటన స్థానికంగా పట్టణంలో చర్చనీయాంశంగా మారింది, సమాజంలో నాలుగో స్థంభంగా భావించే మీడియా రంగానికి చెందిన వ్యక్తిపై ఇటువంటి ఆరోపణలు రావడం పట్ల పలువురు మేధావులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది,అయితే ఆరోపణలపై తుది నిజానిజాలు పోలీసుల విచారణ అనంతరం మాత్రమే వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని,చట్టం తన పని తాను నిష్పక్షపాతంగా నిర్వహించి, వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు...

# ఎయిడ్స్ సురక్ష కార్యక్రమంపై జిల్లా స్థాయి సమీక్ష

(ఆగస్టు -7- హంస కాలంవార్త )

హెచ్ఐవీ నియంత్రణలో 95-95-99 లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి: అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మెడ్చల్--మల్కాజిగిరి, ఆగస్టు 7: మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్ అధ్యక్షతన ఎయిడ్స్ సురక్ష (మొబైలిజషన్ ఫర్ ఎయిడ్స్ సురక్ష - మాస్ ) కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో హెచ్ఐవీ నివారణ, నియంత్రణ, పరీక్షలు, చికిత్స సేవల పురోగతిని అధికారులు సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవీ నియంత్రణలో 95-95-99 లక్ష్యాల సాధన రాష్ట్ర, జాతీయ స్థాయిలో అత్యంత కీలకమని పేర్కొన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మంది తమ ఆరోగ్య స్థితిని తెలుసుకోవడం, నిర్ధారణ పొందిన వారిలో 95 శాతం మందిని యాంటీరెట్రోవైరల్ థెరపీ ( ఏఆర్టి )లో చేర్చడం, చికిత్స పొందుతున్న వారిలో వైరల్ సప్రెషన్ సాధించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలని వివరించారు. జిల్లాలో హెచ్ఐవీ పరీక్షల సేవలను మరింత విస్తరించి, కేసులను ప్రారంభ




దశలోనే గుర్తించి, నిర్ధారణ పొందిన వారిని సకాలంలో ఏఆర్టి కేంద్రాలకు అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే చికిత్స నిరంతరాయంగా కొనసాగడంతో పాటు వైరల్ లోడ్ పరీక్షలు, ఫాలోఅప్ సేవలు, హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తులకు సమగ్ర వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఐసీటీసీలు ( ఐ సి టి సి), ఏఆర్టీ ( ఏఆర్టి ) కేంద్రాలు, జిల్లా హెచ్ఐవి కేర్ యూనిట్ అందిస్తున్న సేవలను మరింత బలోపేతం చేసి విస్తరించాలని, ప్రభుత్వ శాఖలు, ఆరోగ్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, భాగస్వామ్య సంస్థలు మిషన్ మోడ్‌లో సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాను ప్రస్తుతం ఉన్న "సక్షమ్ (సాక్షం )" కేటగిరీ నుంచి "సురక్షిత్ (సురక్షిత్ )" కేటగిరీకి తీసుకురావడానికి జిల్లా ఎయిడ్స్ నివారణ,



నియంత్రణ విభాగం, ఆరోగ్య శాఖ, ఐసీటీసీ లు, ఏ ఆర్ టి కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. కె. ఆనంద్ మాట్లాడుతూ, జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, 95-95-99 లక్ష్యాలను నిర్ణీత గడువులో సాధించి, మెడ్చల్--మల్కాజిగిరి జిల్లాను "సురక్షిత్" కేటగిరీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యక్రమ అధికారి (ఎయిడ్స్ ఌ కుష్ఠు) డా. వై. శ్రీదేవి, దిశా ప్రోగ్రామ్ మేనేజర్ ఎం. సంజీవ్, కె. గణేష్ ( డిఎండిఓ ), ఐ సి టి సి కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి సేవలో శ్రీరాములు అందెల





( ఆగస్టు - 7- హంస కలంవార్త )

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా లాల్‌దర్వాజాలోని శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారిని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల రాములు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలే భవ్య నిర్వహించిన బంగారు బోనం ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం బీజేపీ నాయకులు పున్నా వెంకటరమణ ఆహ్వానం మేరకు శ్రీ నల్లపోచమ్మ దేవాలయానికి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి , బీజేపీ మరియు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## స్టేట్ లెవెల్ రీజినల్ స్కేటింగ్ పోటీలలో గోల్డ్ మెడల్స్ సాధించిన సుజాన్స్ రెడ్డి.

( ఆగస్టు - 7- హంస కలంవార్త ) (ఆలమూరు):-



స్టేట్ లెవెల్ రీజినల్ స్కేటింగ్ పోటీలలో 11 సంవత్సరాల వయస్సు విభాగంలో ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన ద్వారంపూడి సుజాన్స్ రెడ్డి రెండు బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 6న రావులపాలెం సెయింట్ ప్యాట్రిక్స్ స్కూల్లో నిర్వహించిన ఈ పోటీల్లో అదే స్కూల్లో ఐదవ తరగతి చదువుతున్న సుజాన్స్ రెడ్డి అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచాడు. అయితే సుజాన్స్ రెడ్డి కి తల్లిదండ్రులు ద్వారంపూడి రవీందర్ రెడ్డి, శిరీష దంపతులు చిన్నప్పటి నుంచి ప్రోత్సహిస్తూ తన కుమారుడికి స్కేటింగ్ పట్ల ఆసక్తి ఉండటంతో శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. గతంలో కూడా జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు పథకాలు సాధించాడన్నారు. జాతీయ, తదుపరి అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించడమే తన లక్ష్యమని సుజాన్స్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. దీంతో విద్యార్థి బంధువులు ద్వారంపూడి సుబ్బారెడ్డి, నల్లిమిల్లి జ్యోతి రెడ్డి, పలువురు గ్రామ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. బిద

## జాతీయస్థాయి ఫోటో జర్నలిస్టు అవార్డు విజేత రజినీకాంత్ గౌడ్‌ను అభినందించిన కేటీఆర్

(ఆగస్టు -7- హంస కలంవార్త )



కర్ణాటక మీడియా అకాడమీ నిర్వహించిన జాతీయస్థాయి ఫోటో జర్నలిస్టుల అవార్డుల పోటీలో తెలంగాణ రాష్ట్రానికి తృతీయ బహుమతి సాధించిన నమస్తే తెలంగాణ ఫోటో జర్నలిస్ట్ వీరగోని రజినీకాంత్ గౌడ్‌ను బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అభినంది ంచారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని తన నివాసంలో రజినీకాంత్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించిన కేటీఆర్, జాతీయస్థాయిలో ప్రతిభ చాటుతూ తెలంగాణకు గుర్తింపు తీసుకురావడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఫోటో జర్నలిజం రంగంలో ఆయన సాధించిన విజయం యువ ఫోటో జర్నలిస్టులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.ఁభవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు, పురస్కారాలు అందుకొని తెలంగాణ ఖ్యాతిని మరింత పెంచాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రజినీకాంత్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఫోటో జర్నలిజం రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.

## అంగరంగ వైభవంగా అమ్మవారి తొట్టెల ఊరేగింపు



( ఆగస్టు -7- హంస కలంవార్త )

ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని రజక బస్తీ, సంగీత్ నగర్, దయార్ గూడ ప్రాంతాల్లో అమ్మవారి తొట్టెల ఊరేగింపు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా అలంకరించిన తొట్టెలు, డప్పు వాయిద్యాలు, జానపద కళా బృందాల ప్రదర్శనలు, భక్తుల జైజైధ్వానాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళ లాడింది. తొట్టెల ఊరేగింపు నిర్వాహకుల ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగదాంబ అమ్మవారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తి, శ్రద్ధలతో జరుపుకోవడం ఆనంద దాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు గారికి నిర్వాహకులు, స్థానిక భక్తులు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో డివిజన్ నాయకులు చదుర్వల్లి శ్రీనివాస్ గౌడ్, అనంత నాగరాజు, దుర్గాప్రసాద్ రావు, నర్సింగ్, కట్ట శంకర్ రెడ్డి, రమణారెడ్డి, శివ పటేల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మహిళలు, యువకులు, చిన్నారులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. బోనాల పండుగ సందర్భంగా నిర్వహించిన తొట్టెల ఊరేగింపు భక్తి, సంప్రదాయం, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచి స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది.

## ఎల్లమ్మబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదుల ప్రారంభం




(ఆగస్టు -7- హంస కలంవార్త )

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో నూతనంగా నిర్మించిన రెండు అదనపు తరగతి గదుల భవనాన్ని గౌరవ పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ( ఎం ఈ ఓ ) రవీందర్ రాజు , మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్ , శ్రీ నార్నె శ్రీనివాసరావు , రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ మాట్లాడుతూ, రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలలో రెండు అదనపు తరగతి గదులు నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో సంతోషకరమైన విషయ మన్నారు. ఇది పాఠశాలకు పండుగరోజు లాంటిదని, ఈ భవనం విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడటంతో పాటు వారి ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రాథమిక విద్యే ప్రతి విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దే మూలాధారమని, విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదలతో చదివి ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సీఎస్ఆర్ నిధులతో అన్ని హంగులు, సకల సౌకర్యాలతో, ప్రశాంతమైన విద్యా వాతావరణాన్ని కల్పించేలా ఈ భవనాన్ని నిర్మించిన రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. సమాజానికి సేవ చేయడంలో వారు ఆదర్శంగా నిలిచారని, ప్రతి సంస్థ తమ సామాజిక బాధ్యతలో భాగంగా విద్యారంగ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యాభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న ఆయన, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మియాపూర్‌లో 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా పాఠశాల ఏర్పాటు దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే కొండాపూర్, చందానగర్ ప్రాంతాల్లో కోర్ అర్బన్ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాలనీవాసులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ ఫీజులపై కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం

**-మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్ హీరో కావటం ఖాయం..!**

( ఆగస్టు - 7- హంస కలంవార్త )

నిన్నటి వరకు కుర్రకారు తఢాకా ఎలా ఉంటుందో చూపించిన కాక్రోచ్ జనతా పార్టీ.. ఇప్పుడు మరో సంచలన నిర్ణయంతో జనంలోకి వస్తుంది. అదేంటో తెలుసా.. క్యా బోల్తీ పబ్లిక్.. జనం ఏం అనుకుం టున్నారు.. జనం ఏం చెబుతున్నారు.. క్యా బోల్తీ పబ్లిక్ అనే నినాదంతో.. దేశ వ్యాప్తంగా జనంలోకి వచ్చేస్తోంది కాక్రోచ్ జనతా పార్టీ. దేశంలో స్కూల్స్, కాలేజీల పరిస్థితి ఏంటీ.. స్కూల్ ఫీజులు ఎలా ఉన్నాయి.. కోచింగ్ సెంటర్ల దందా ఏంటీ.. కాలేజీల్లో ఫీజుల వసూళ్ల సంగతి ఏంటీ.. విద్యా వ్యవస్థ ఎలా ఉంది.. ఎలాంటి సంస్కరణలు జరుగుతున్నాయి.. వాటి ఫలితాలు ఏంటీ.. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు విషయంలో ఏం కోరుకుంటున్నారు.. వాళ్లు చెప్పాలనుకుంటున్నది ఏంటీ.. వాళ్ల బాధలు ప్రభుత్వాలు పట్టించుకుం టున్నాయా లేదా.. ఇలాంటి విషయాలపై క్యా బోల్తీ పబ్లిక్ నినాదంతో.. దేశ వ్యాప్తంగా కాక్రోచ్ జనతా పార్టీ




అతి పెద్ద క్యాంపెయిన్ స్టార్ట్ చేస్తుంది. ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తమ తర్వాత టార్గెట్ విద్యా వ్యవస్థలో సంస్కరణలు, స్కూల్ ఫీజులు అని వెల్లడించారాయన. దేశంలో చదువు అందుబాటులో లేకుండా పోయింది.. ఒకటో తరగతి పిల్లగాడి ఫీజు లక్ష రూపాయలు ఏంటీ.. మధ్య తరగతి ప్రజలు, పేద కుటుంబాలు ఇంత ఫీజులు భరించగలవా అని ప్రశ్నించారాయన. ఆదాయం తక్కువగా ఉన్న కుటుంబాలు, మిడిల్ క్లాస్ ఫ్యామిలీలు లక్షలకు లక్షల ఫీజులు ఎలా భరించగలరు.. ఆ కుటుంబాలు డబ్బులను ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలి.. ఇలాంటి ప్రశ్నలతో జనంలోకి వెళ్లి.. తల్లిదండ్రుల అభిప్రా యాలను తెలుసుకుంటామని స్పష్టం చేశారు కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే. స్కూల్, కాలేజీ ఫీజులు భారీగా పెరగటంతో.. కోచింగ్ సెంటర్లలో ఇష్టానుసారం దోపిడీ జరుగుతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించిన దీప్కే.. పిల్లల చదువు కోసమే కుటుంబాల్లో అప్పుల్లో కూరుకుపోతున్నాయని.. తల్లిదండ్రులకు పిల్లల చదువు భారంగా మారిందని.. దేశంలో ఇలాంటి పరిస్థితులను మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని తన అభిప్రా యాన్ని వ్యక్తం చేశారు అభిజీత్ దీప్కే. విద్య అనేది ప్రాథమిక హక్కు అని రాజ్యాంగం చెబుతుంది.. అలాంటి హక్కు కొన్నేళ్లుగా వ్యాపారంగా మారింది.. ఇది మారాలి.. మారి తీరాలి.. అందుకే క్యా బోల్తీ పబ్లిక్ నినాదంతో జనంలోకి వెళుతున్నట్లు ప్రకటిం చారు కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే.

# తెలంగాణా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సుస్థిర రవాణా వైపు వేగంగా అడుగులు

**-యు ఐ టి పి ఇండియా బస్ కాన్ఫరెన్స్ 2026' విజయవంతం**

**-ప్రపంచ స్థాయి వేదికపై మెరిసిన తెలంగాణ ఆర్టీసీ**

**-కన్వీనర్ హోదాలో పాల్గొన్న టీజీఎస్ ఆర్టీసీ వీసీ- ఎండీ వై.నాగిరెడ్డి**

( ఆగస్టు - 7- హంస కలంవార్త )

వేగంగా పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా పర్యావరణ అనుకూల, అధునాతన సాంకేతిక ఆధారిత బస్సు రవాణా వ్యవస్థను రూపొందించే ప్రధాన లక్ష్యంతో ఢిల్లీలో ' యు ఐ టి పి ఇండియా బస్ కాన్ఫరెన్స్ 2026' ను రెండు రోజుల పాటు నిర్వహించారు. దేశంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, వాటి నిర్వహణ, ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు మరియు డిజిటల్ చెల్లింపులపై ఈ అంతర్జాతీయ సదస్సు ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించింది. ఈ ప్రతిష్టాత్మక సదస్సులో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ( టి జి ఎస్ ఆర్ టి సి) వీసీ ఎండీ వై.నాగిరెడ్డి కన్వీనర్ హోదాలో హాజరై ప్రసంగించారు టీజీఎస్ ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు సంస్థను ఆర్థికంగా, నిర్వహణాపరంగా బలోపేతం చేసేందుకు




చేపడుతున్న విప్లవాత్మక నిర్ణయాలను సంస్థ ఏండీ తన సమగ్ర ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో పర్యావరణ అనుకూల ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచడం, ప్రయాణికులకు సురక్షితమైన డిజిటల్ సేవలు అందించడం మరియు క్షేత్రస్థాయిలో రవాణా సామర్థ్యాన్ని పెంచేందుకు సంస్థ చేపడుతున్న ఆధునిక సంస్కరణలను ప్రపంచ స్థాయి ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించారు. రెండు రోజుల పాటు సాగిన ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల రవాణా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు, విధాన రూపకర్తలు మరియు నిపుణులతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి బస్సుల నిర్వహణ, ఆర్థిక సవాళ్లు, సబ్సిడీలు మరియు ప్రభుత్వాల మద్దతుపై లోతుగా చర్చించారు. సదస్సు రెండవ రోజు శుక్రవారం పరిశ్రమల అధినేతలు, అంతర్జాతీయ నిపుణులు మరియు స్టార్టప్ ప్రతినిధులు పాల్గొని స్మార్ట్ మొబిలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత మరియు భవిష్యత్తు రవాణా నమూనాలను వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో ట్రాఫిక్ వేళలను ముందే ఊహించి బస్సులను నడిపే ప్రిడిక్టివ్ మొబిలిటీ పద్ధతులను ఈ సమావేశంలో నిపుణులు ప్రతిపాదించారు. 'నెట్-జీరో' కార్బన్ ఉద్గారాల లక్ష్య సాధనలో భాగంగా 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడం, వీటి కోసం గ్రీన్ బాండ్లు మరియు దీర్ఘకాలిక తక్కువ వడ్డీ రుణాల ద్వారా నిధులు సమకూర్చడంపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే ప్రయాణికులకు వై-ఫై, డిజిటల్ టికెటింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు మెట్రో, బస్సు, ఆటో సేవలను 'నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్' (చీజవీజ) మరియు మీఝూ 2.0 యాప్ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. సంస్థల ఆర్థిక బలోపేతానికి ప్రకటనలు, డేటా మోనిటైజేషన్, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (ౡౡా) ద్వారా అదనపు ఆదాయం పొందాలని స్పష్టం చేశారు. భవిష్యత్తు సాంకేతికతల్లో భాగంగా డ్రైవర్ రహిత అటానమస్ షటిల్స్, అర్బన్ ఎయిర్ మొబిలిటీ వినియోగంపై కూడా కీలక ప్రతిపాదనలు చేశారు. సమర్థవంతమైన రవాణా మార్పు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు ప్రైవేట్ సంస్థల మధ్య బలమైన సమన్వయం ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల ఆర్టీసీ ఎండీలు, అంతర్జాతీయ ప్రతినిధులు, పరిశ్రమల అధినేతలు మరియు స్టార్టప్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా బోనాల పండుగ







మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా. ( ఆగస్టు - 7- హంస కలంవార్త )

తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢమాసంలో గ్రామ దేవతలకు భక్తి శ్రద్దలతో జరుపుకునే రాష్ట్ర పండుగ అయిన బోనాల పండు ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని భువనేశ్వరీ మాత ఆలయంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందరూ కలిసి పండుగను వేడుకగా జరుపుకున్నారు. పోతరాజులతో కలిసి అధికారులు, సిబ్బంది ఎంతో ఉత్సహంగా నృత్యవిన్యాసాలతో పాటు డప్పు వాయిద్యాల మధ్య బోనాలను కార్యాలయం నుండి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. మహిళా సిబ్బంది అత్యంత భక్తి శ్రద్దలతో బోనాలను అమ్మవారికి సమర్పించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 2026 ఆగస్టు 10న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల/ఎస్ కె యం పిలుపుమేరకు "జైల్ భరో"కార్యక్రమంలో ఆశ వర్కర్స్ పాల్గొంటాం







( ఆగస్టు - 7- హంస కలంవార్త )

కార్మిక సంఘాల/ఎస్ కె ఎం పిలుపు మేరకు"జైల్ భరో"కార్యక్రమంలో ఆశ వర్కర్స్ పాల్గొంటామని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ సి ఐ టి యు ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రము తాండూర్ లో కె. జయమేరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగినది.దాగం రాజారాం సి ఐ టి యు మంచిర్యాల్ జిల్లా సహాయ కార్యదర్శి బొల్లం రాజేశం డి పై ఎఫ్ ఐ నాయకులు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులు, సౌకర్యాలపై దాడి చేస్తూ యజమానులకు ప్రయోజనం కలిగించే విధంగా 2025 నవంబర్ 21 న 4 లేబర్ కోడ్ లను అమల్లోకి తెచ్చింది. 44 కార్మిక చట్టాలను రద్దు చేసింది. వీటివల్ల కార్మికులు, ఉద్యోగుల పై పని భారం పెరుగుతుంది. జీతభత్యాలు పెరగవు. ఉద్యోగ భద్రత ఉండదు. సంక్షేమ పథకాల అమలు నీరు గారుతుంది. వీటిని దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశారు. దీనివల్ల వ్యవసాయ కార్మికుల ఉపాధి దెబ్బతింటుంది. నూతన విద్యా విధానం వల్ల విద్యారంగం పూర్తిస్థాయి కార్పొరేట్ కరణ అవుతుంది. విద్యుత్ సవరణ బిల్లు వల్ల వినియోగదారులపై భారం పడుతుంది. ప్రభుత్వ విద్యుత్ రంగం ప్రైవేట్ పరం అవుతుంది. రైతుల గిట్టుబాటు ధర ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నారు వీటన్నిటికీ నిరసనగా జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాము ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు కార్మికులు.తారాబాయి హెల్త్ సూపర్ వైజాగ్,స్రవంతి , ఏ ఎన్ ఎం, పద్మ ఏ ఎన్ ఎం, నవత తిరుపతమ్మ ఏ ఎన్ ఎం,సావిత్రి ఆశ వర్కర్ మరియు ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.

# బోనాలు... తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహా సంస్కృతి ఉత్సవం చరిత్ర, సంప్రదాయాలు, నేటి సవాళ్లపై ప్రత్యేక కథనం”









( ఆగస్టు -7- హంస కాలంవార్త )

బోనాల ఆవిర్భావం నుంచి నేటి యువత పాత్ర వరకు... ఆచారాలు, జానపద కళలు, మారుతున్న పరిస్థితులు, సంప్రదాయ పరిరక్షణపై సమగ్ర విశ్లేషణ. బోనాల చరిత్ర -- ఆవిర్భావం, ప్రాముఖ్యత, తెలంగాణ సంస్కృతిలో స్థానం తెలంగాణ అంటే మనకు ముందుగా గుర్తుకు వచ్చేవి బతుకమ్మ, బోనాలు. ఈ రెండు పండుగలు తెలంగాణ ప్రజల జీవన విధానానికి, సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతిబింబాలుగా నిలిచాయి. ముఖ్యంగా బోనాల పండుగ తెలంగాణ ప్రజల భక్తి, విశ్వాసం, సామాజిక ఐక్యత, జానపద కళా వైభవానికి ప్రతీకగా నిలిచింది. ఇది కేవలం ఒక మతపరమైన ఉత్సవం కాదు; ప్రజల జీవన తత్వం, ఆత్మీయత, అమ్మవారి పట్ల ఉన్న అపారమైన భక్తికి నిదర్శనం. ఆషాఢ మాసం రాగానే తెలంగాణ అంతటా భక్తి వాతావరణం నెలకొంటుంది. గ్రామ దేవతల ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి. అమ్మవారి ఆలయాల వద్ద డప్పుల మోతలు, మంగళ వాయిద్యాలు, జానపద కళారూపాలు, సంప్రదాయ నృత్యాలు తెలంగాణ సంస్కృతికి జీవం పోస్తాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, గోల్కొండ, లాల్‌దర్వాజా, బాల్కంపేట, కూకట్‌పల్లి, ఉప్పల్, మేడ్చల్, వరంగల్, సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి ప్రాంతాల్లో బోనాల పండుగ అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ‘బోనం’ అనే పదం అర్థం ‘బోనం’ అనే పదం ‘భోజనం’ అనే పదం నుంచి ఉద్భవించిందని పండితులు చెబుతారు. అమ్మవారికి సమర్పించే నైవేద్యాన్ని బోనం అంటారు. కొత్త మట్టికుండలో లేదా ఇత్తడి పాత్రలో బియ్యం, పాలు, బెల్లంతో అన్నం వండి, పసుపు, కుంకుమతో అలంకరించి, వేపాకులతో కప్పి, దీపం వెలిగించి అమ్మవారికి సమర్పించడం బోనాల ప్రధాన ఆచారం. ఇది కృతజ్ఞత, భక్తి, సమర్పణ భావానికి ప్రతీక. బోనాల ఆవిర్భావం -- చారిత్రక నేపథ్యం బోనాల పండుగ ఆవిర్భావంపై అనేక కథనాలు ఉన్నప్పటికీ, ప్రజల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందిన విశ్వాసం ప్రకారం 1813 ప్రాంతంలో హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి తీవ్రంగా వ్యాపించింది. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఉజ్జయినిలో ఉన్న సైనికులు మహంకాళి అమ్మవారిని ప్రార్థిస్తూ, “మా నగరాన్ని ఈ మహమ్మారి నుంచి రక్షిస్తే ప్రతి సంవత్సరం నీకు బోనం సమర్పిస్తాం” అని మొక్కుకున్నారని చెబుతారు. తర్వాత వ్యాధి తగ్గడంతో వారు అమ్మవారి విగ్రహాన్ని హైదరాబాద్‌కు తీసుకువచ్చి ఆలయాన్ని నిర్మించి బోనాలు సమర్పించారు. అప్పటి నుంచి ప్రతి ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించే సంప్రదాయం ప్రారంభమై, క్రమంగా తెలంగాణ అంతటా విస్తరించింది. చారిత్రకంగా వివిధ కథనాలు ఉన్నప్పటికీ, ఈ పండుగకు భక్తి, ప్రజా విశ్వాసం ప్రధాన ఆధారం. తెలంగాణ సంస్కృతిలో బోనాల స్థానం బోనాలు తెలంగాణ సాంస్కృతిక గుర్తింపులో విడదీయరాని భాగం. ఈ పండుగలో మహిళల భక్తి, గ్రామీణ జీవనశైలి, జానపద కళలు, స్థానిక దేవతల ఆరాధన, సామాజిక ఐక్యత అన్నీ ఒకే వేదికపై కనిపిస్తాయి. తెలంగాణలో గ్రామదేవతల ఆరాధనకు ఎంతో ప్రాధాన్యం ఉంది. మహంకాళి, పోచమ్మ, యెల్లమ్మ, మైసమ్మ, పెద్దమ్మ, పోలేరమ్మ వంటి దేవతలను ప్రజలు తమ గ్రామాలను, కుటుంబాలను కాపాడే శక్తులుగా విశ్వసిస్తారు. బోనాలు ఆ విశ్వాసానికి జీవం పోసే పండుగ. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, పొరుగువారు అందరూ కలిసి పాల్గొనడం సమాజంలో అనుబంధాలను మరింత బలపరుస్తుంది. భక్తి, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనం బోనాల పండుగలో భక్తి మాత్రమే కాదు, తెలంగాణ జానపద కళల వైభవం కూడా ప్రతిఫలిస్తుంది. డప్పు వాయిద్యాలు, ఒగ్గు కథలు, సంప్రదాయ నృత్యాలు, పోతురాజు విన్యాసాలు, ఘటం ఊరేగింపులు, రంగం కార్యక్రమాలు ఈ పండుగకు ప్రత్యేక ఆకర్షణలు. ఇవన్నీ తెలంగాణ చరిత్ర, సంస్కృతి, జానపద వారసత్వాన్ని నేటి తరాలకు పరిచయం చేస్తున్నాయి. మహిళల పాత్ర -- బోనాల ఆత్మ బోనాల పండుగలో మహిళల పాత్ర అత్యంత గొప్పది. వారు ఇంటిని శుభ్రపరచి, బోనం సిద్ధం చేసి, సంప్రదాయ వస్త్రధారణలో అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. ఈ ఆచారం కుటుంబ క్షేమం, పిల్లల ఆరోగ్యం, సమాజ శాంతి కోసం చేసే ప్రార్థనగా భావిస్తారు. బోనాలు మహిళల భక్తి, సహనం, కుటుంబ విలువలకు ప్రతీకగా నిలుస్తాయి. సామాజిక ఐక్యతకు ప్రతీక బోనాల సందర్భంగా కుల, మత, వర్గ భేదాలు పక్కనపెట్టి ప్రజలంతా కలిసి పండుగను నిర్వహిస్తారు. ఆలయాల నిర్వహణ, అన్నదానాలు, ఊరేగింపులు, సేవా కార్యక్రమాల్లో యువత, మహిళలు, పెద్దలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తారు. ఈ పండుగ సమాజంలో ఐక్యతను, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తుంది. రాష్ట్ర పండుగగా గుర్తింపు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం బోనాలకు మరింత ప్రాధాన్యం లభించింది. ప్రభుత్వం అధికారికంగా నిర్వహణకు సహకరిస్తూ, ఆలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు, భద్రత, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. దీంతో బోనాలు కేవలం ప్రాంతీయ పండుగగా కాకుండా తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసే మహోత్సవంగా మారాయి. మన బాధ్యత నేటి ఆధునిక జీవనశైలిలో కూడా బోనాల వంటి సంప్రదాయ పండుగలను కాపాడుకోవడం అత్యంత అవసరం. బోనాలు కేవలం ఉత్సవం కాదు; అది మన పూర్వీకుల వారసత్వం, మన సంస్కృతికి మూలస్తంభం. ఈ పండుగ వెనుక ఉన్న చరిత్ర, భక్తి, విలువలను భావితరాలకు అందించడం ప్రతి తెలంగాణవాసి బాధ్యత. ముగింపు బోనాలు తెలంగాణ ప్రజల గుండె చప్పుడు. ఇది భక్తి, సంస్కృతి, సంప్రదాయం, సామాజిక ఐక్యత, మహిళల గౌరవం, జానపద కళల సమ్మేళనం. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ మహోత్సవం తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తూ, ప్రతి ఇంటిలో భక్తిని, ప్రతి హృదయంలో గర్వాన్ని నింపుతోంది.

బోనాలు కేవలం పండుగ కాదు...
తెలంగాణ సంస్కృతికి సజీవ చిహ్నం.
బోనాలు కేవలం నైవేద్యం కాదు...
మన భక్తి, మన వారసత్వం, మన ఆత్మగౌరవానికి చిరస్థాయి ప్రతీక.

బోనాల ఆచారాలు -- భక్తి, సంప్రదాయం, సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ అనగానే భక్తి, ఆచారం, సంప్రదాయం, తెలంగాణ జానపద సంస్కృతి అన్నీ ఒక్కచోట కలిసిన దృశ్యం కళ్లముందు ప్రత్యక్షమవుతుంది. ఆషాఢ మాసంలో అమ్మవారికి కృతజ్ఞతగా నిర్వహించే ఈ పండుగలో ప్రతి ఆచారానికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యం ఉంది. పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాలను నేటికీ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తున్నారు. బోనాల పండుగ ప్రారంభానికి ముందే ఆలయాలను శుభ్రపరచి, సున్నం వేయడం, రంగురంగుల తోరణాలతో అలంకరించడం జరుగుతుంది. గ్రామాలు, పట్టణాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకుంటాయి. కుటుంబ సభ్యులు కొత్త బట్టలు ధరించి అమ్మవారి దర్శనానికి సిద్ధమవుతారు. మొక్కులు పెట్టుకున్న భక్తులు ఉపవాస దీక్షలు పాటిస్తూ అమ్మవారిని ప్రార్థిస్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహిస్తారు. బోనం -- అమ్మవారికి సమర్పించే పవిత్ర నైవేద్యం “బోనం” అనే పదం “భోజనం” అనే పదం నుంచి ఉద్భవించిందని చెబుతారు. అమ్మవారికి సమర్పించే అన్నప్రసాదమే బోనం. కొత్త మట్టి లేదా ఇత్తడి కుండలో బియ్యం, పాలు, బెల్లంతో అన్నం వండి, అందులో పెరుగు, పసుపు, కుంకుమతో అలంకరిస్తారు. వేపాకులను కుండ చుట్టూ అమర్చి, పైన దీపాన్ని వెలిగిస్తారు. బోనం తలపై పెట్టుకొని మహిళలు భక్తిగీతాలు పాడుతూ, డప్పుల మోతల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు. ప్రతి అడుగులోనూ అమ్మవారి నామస్మరణ చేస్తూ, కుటుంబ శ్రేయస్సు, ఆరోగ్యం, సుఖశాంతుల కోసం ప్రార్థిస్తారు. ఆలయానికి చేరుకున్న తరువాత పూజారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బోనం కేవలం నైవేద్యం మాత్రమే కాదు. అది భక్తి, వినయం, కృతజ్ఞత, అమ్మవారిపై విశ్వాసానికి ప్రతీకగా భావిస్తారు. పోతురాజు -- బోనాల పండుగకు ప్రతీక బోనాల పండుగలో అత్యంత ఆకర్షణీయమైన పాత్ర పోతురాజుది. పోతురాజును అమ్మవారి సోదరుడిగా భావిస్తారు. శక్తి, ధైర్యం, రక్షణకు ప్రతీకగా ఆయనను పూజిస్తారు. పోతురాజు ఒంటికి పసుపు రాసుకొని, నడుముకు ఎర్రటి వస్త్రం కట్టుకొని, కాళ్లకు గజ్జెలు ధరించి, చేతిలో కొరడాతో ఊరేగింపుకు ముందుంటాడు. డప్పుల శబ్దానికి అనుగుణంగా ఉత్సాహభరితంగా నృత్యం చేస్తూ భక్తులను ఉత్తేజపరుస్తాడు. పోతురాజు ఊరేగింపు దుష్టశక్తులను పారదోలుతుందని, గ్రామాన్ని రక్షిస్తుందని ప్రజల విశ్వాసం. ఆయన చేసే నృత్యం తెలంగాణ జానపద సంస్కృతిలో ఒక విశిష్ట కళారూపంగా గుర్తింపు పొందింది. ఘటం -- అమ్మవారి శక్తి స్వరూపం బోనాల పండుగలో మరో ప్రధాన ఆకర్షణ ఘటం. పసుపు, కుంకుమతో అలంకరించిన మట్టి కుండనే ఘటం అంటారు. దీనిని అమ్మవారి శక్తి స్వరూపంగా భావిస్తారు. పూజారులు ప్రత్యేక పూజల అనంతరం ఘటాన్ని తలపై పెట్టుకొని ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకువెళ్తారు. డప్పులు, డోలు, శంఖనాదాలు, భక్తుల జైజైధ్వానాల మధ్య ఈ ఊరేగింపు అత్యంత వైభవంగా సాగుతుంది. చివరి రోజున ఘటాన్ని పవిత్ర జలాశయంలో నిమజ్జనం చేస్తారు. ఇది చెడుపై మంచి సాధించిన విజయానికి, ప్రకృతి చక్రానికి ప్రతీకగా భావిస్తారు. రంగం -- భవిష్యవాణి చెప్పే సంప్రదాయం బోనాల పండుగలో ప్రత్యేక ఆచారం “రంగం”. ఈ కార్యక్రమంలో అమ్మవారి భక్తురాలు పూజల అనంతరం ఆధ్యాత్మిక పారవశ్యంలోకి వెళ్లి భవిష్యవాణి చెబుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఈ సందర్భంగా ప్రజలు వ్యవసాయం, వర్షాలు, ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి వంటి అంశాలపై చెప్పే సందేశాలను ఎంతో భక్తితో వింటారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం తెలంగాణ సాంస్కృతిక వారసత్వంలో ఒక విశిష్ట భాగం. బోనాలలో మహిళల పాత్ర ోనాల పండుగలో మహిళల పాత్ర అత్యంత విశిష్టమైనది. ఈ పండుగకు మహిళలే ప్రధాన ఆకర్షణ. కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సుఖసంతోషాలు, పిల్లల శ్రేయస్సు కోసం అమ్మవారికి బోనం సమర్పించడం మహిళల భక్తికి నిదర్శనం. ఉదయం నుంచే ఇంటిని శుభ్రపరచి, ముగ్గులు వేసి, బోనం సిద్ధం చేస్తారు. సంప్రదాయ చీరలు ధరించి, బంగారు ఆభరణాలతో అలంకరించుకొని, తలపై బోనం పెట్టుకొని భక్తిశ్రద్ధలతో ఆలయానికి వెళ్తారు. మహిళల భక్తి, క్రమశిక్షణ, సంప్రదాయాల పట్ల గౌరవం వల్లే బోనాల పండుగ తరతరాలకు కొనసాగుతోందని చెప్పవచ్చు. జానపద కళలు -- తెలంగాణ సంస్కృతికి జీవం బోనాల పండుగ అంటే కేవలం పూజలు మాత్రమే కాదు; తెలంగాణ జానపద కళల మహోత్సవం కూడా. డప్పు, డోలు, తీన్మార్ వాయిద్యాలు, ఒగ్గు కథలు, బుర్రకథ, కోలాటం, చిందు భాగోతం, శివసత్తులు, పులివేషాలు, వివిధ జానపద నృత్యాలు ఈ పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. డప్పుల మోతతో మారుమోగే వీధులు, తీన్మార్ నృత్యాలు, రంగురంగుల వేషధారణలు, కళాకారుల ప్రదర్శనలు తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయి. ఈ కళల ద్వారా యువతకు తెలంగాణ సంప్రదాయాలు, జానపద వారసత్వం పరిచయమవుతోంది. సాంస్కృతిక ప్రాధాన్యం బోనాల పండుగలోని ప్రతి ఆచారం ఒక విశ్వాసానికి, ప్రతి ఊరేగింపు ఒక సంస్కృతికి, ప్రతి జానపద కళ ఒక చరిత్రకు ప్రతీక. బోనం సమర్పించడం భక్తిని సూచిస్తే, పోతురాజు ధైర్యాన్ని సూచిస్తాడు. ఘటం అమ్మవారి శక్తికి చిహ్నమైతే, రంగం ప్రజల విశ్వాసానికి ప్రతీక. మహిళల భాగస్వామ్యం ఈ పండుగకు ఆత్మవంటిది. జానపద కళలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి. అందుకే బోనాల పండుగ కేవలం ఒక మతపరమైన ఉత్సవం మాత్రమే కాదు; తెలంగాణ ఆత్మ, సంప్రదాయం, భక్తి, ఐక్యత, జానపద సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబించే మహోత్సవంగా చిరస్థాయిగా నిలిచింది. నేటి యువత పాత్ర, మారుతున్న పరిస్థితులు, మద్యం--డీజే సంస్కృతి ప్రభావం, సంప్రదాయ పరిరక్షణ, నిపుణుల అభిప్రాయాలు, ముగింపు నేటి యువత పాత్ర బోనాల పండుగను భావితరాలకు అందించడంలో నేటి యువత కీలక పాత్ర పోషిస్తోంది. ఆలయాల అలంకరణ, ఊరేగింపుల నిర్వహణ, భక్తులకు సేవలు, ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సహకారం, తాగునీరు, వైద్య శిబిరాలు, అన్నదాన కార్యక్రమాల్లో స్వచ్ఛంద సేవకులుగా యువత ముందుంటోంది. సోషల్ మీడియా ద్వారా బోనాల చరిత్ర, విశిష్టత, ఆచారాలను ప్రచారం చేయడం ద్వారా సంప్రదాయాన్ని మరింత మందికి చేరవేస్తున్నారు. అయితే యువత సంప్రదాయాన్ని కేవలం ఉత్సవంగా కాకుండా, దాని ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను కూడా అర్థం చేసుకుని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉంది. మారుతున్న పరిస్థితులు కాలానుగుణంగా బోనాల వేడుకల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. నగరీకరణ, ఆధునిక సాంకేతికత, సామాజిక మాధ్యమాల ప్రభావంతో ఉత్సవాల నిర్వహణ మరింత విస్తరించింది. ఆలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, డ్రోన్



పర్యవేక్షణ, డిజిటల్ సమాచార వ్యవస్థలు, ఆన్‌లైన్ సేవలు వంటి ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. అదే సమయంలో సంప్రదాయ వాద్యాలు, జానపద కళారూపాలకు బదులుగా ఆధునిక వినోద కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరగడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం--డీజే సంస్కృతి ప్రభావం ఇటీవలి కాలంలో కొన్ని ప్రాంతాల్లో బోనాల సందర్భంగా అధిక శబ్దంతో డీజేలు, సభ్యకరమైన పాటలు, మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనడం వంటి ఘటనలు కనిపిస్తున్నాయి. ఇవి పండుగ యొక్క ఆధ్యాత్మికతను, భక్తి భావాన్ని దెబ్బతీసే అంశాలుగా విమర్శలు ఎదుర్కొంటున్నాయి. బోనాలు అమ్మవారిపై భక్తి, గ్రామసంస్కృతి, సామూహిక ఐక్యతకు ప్రతీక. అలాంటి పండుగలో మద్యం సేవించడం లేదా ఇతరులకు అసౌకర్యం కలిగించే విధంగా ప్రవర్తించడం సంప్రదాయ స్ఫూర్తికి అనుకూలం కాదని అనేక మంది పెద్దలు, సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో యువతలో చాలామంది భక్తిపూర్వకంగా, క్రమశిక్షణతో పాల్గొంటున్నారన్న విషయాన్ని కూడా గుర్తించాలి. అందువల్ల కొందరి ప్రవర్తనను మొత్తం యువతకు ఆపాదించడం సరైంది కాదు. సంప్రదాయ పరిరక్షణ బోనాల అసలైన ఆత్మను కాపాడుకోవాలంటే కుటుంబం నుంచే పిల్లలకు ఈ పండుగ చరిత్ర, విశిష్టత, ఆచారాల గురించి తెలియజేయాలి. పాఠశాలలు, కళాశాలలు, సాంస్కృతిక సంస్థలు తెలంగాణ జానపద సంప్రదాయాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అలాగే పోతురాజు ఆటలు, డప్పు వాయిద్యం, ఒగ్గు కథలు, జానపద నృత్యాలు వంటి స్థానిక కళారూపాలకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలి. పర్యావరణానికి హాని కలగకుండా, భక్తులకు ఇబ్బంది లేకుండా, క్రమశిక్షణతో ఉత్సవాలు నిర్వహించడం ద్వారా బోనాల గొప్పతనాన్ని భావితరాలకు అందించవచ్చు. నిపుణుల అభిప్రాయాలు చరిత్రకారులు, జానపద పరిశోధకుల అభిప్రాయం ప్రకారం బోనాలు కేవలం ఒక మతపరమైన పండుగ మాత్రమే కాదు; తెలంగాణ సమాజం, సంస్కృతి, గ్రామీణ జీవన విధానం, మహిళల భాగస్వామ్యం, జానపద కళల సమ్మేళనం. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక సదుపాయాలను స్వీకరించడం అవసరమే అయినప్పటికీ, పండుగ యొక్క అసలు స్ఫూర్తి, భక్తి, సంప్రదాయ విలువలు దెబ్బతినకుండా చూసుకోవడం అందరి బాధ్యత. ముగింపు బోనాలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోన్నత సాంస్కృతిక వేడుక. ఈ పండుగలో భక్తి ఉంది, సంస్కృతి ఉంది, కుటుంబ బంధం ఉంది, మహిళల నాయకత్వం ఉంది, జానపద కళల వైభవం ఉంది. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త పద్ధతులు వచ్చినా, బోనాల అసలైన ఆత్మ భక్తి, సామరస్యం, సంప్రదాయం, సామూహిక ఐక్యతలోనే ఉంది. నేటి యువత ఈ సంప్రదాయాన్ని గౌరవిస్తూ, మద్యం, అసభ్యకర వినోదం, అధిక శబ్ద కాలుష్యానికి దూరంగా ఉండి, భక్తి భావంతో ఉత్సవాల్లో పాల్గొంటే బోనాల మహిమ మరింత పెరుగుతుంది. సంప్రదాయం మరియు ఆధునికత మధ్య సమతుల్యతను పాటిస్తూ, తెలంగాణ సంస్కృతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటడం మనందరి బాధ్యత. “బోనం కేవలం అమ్మవారికి సమర్పించే నైవేద్యం మాత్రమే కాదు... తెలంగాణ ప్రజల విశ్వాసానికి, సంస్కృతికి, ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీక

ప్రత్యేక విశ్లేషణ: వి. విష్ణుమూర్తి

# కార్పొరేట్ స్కూల్ ఫీజుల దోపిడి...




## తల్లిదండ్రులపై పెరుగుతున్న ఆర్థిక భారం




(ఆగస్టు -7- హంస కలంవార్త )

అనుమతులు లేకుండానే కొన్ని విద్యాసంస్థల నిర్వహణపై ఆరోపణలు.. పట్టించుకోని అధికారులపై విమర్శలుదదేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది విద్య. ఒక కుటుంబం ఎంత కష్టాల్లో ఉన్నా తమ పిల్లలకు మంచి విద్య అందించాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. విద్య అనేది ఒక హక్కు మాత్రమే కాదు, సమాజ అభివృద్ధికి పునాది కూడా. అయితే ఇటీవలి కాలంలో విద్యా రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు విద్యను సేవగా కాకుండా లాభదాయక వ్యాపారంగా మార్చేశాయనే విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నాణ్యమైన విద్య, అత్యాధునిక సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఒలింపియాడ్స్, ప్రత్యేక శిక్షణ వంటి పేర్లతో భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు, సాధారణ ప్రైవేట్ పాఠశాలల ద్వారా విద్య అందుబాటులో ఉండేది. కానీ కాలక్రమేణా కార్పొరేట్ విద్యాసంస్థలు విస్తరించడంతో విద్యా వ్యవస్థలో పోటీ పెరిగింది. ఈ పోటీని అవకాశంగా మార్చుకున్న కొన్ని యాజమాన్యాలు భారీ ఫీజులు నిర్ణయించి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు తమ ఆదాయంలో గణనీయమైన భాగాన్ని పిల్లల చదువులకే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం కొన్ని కార్పొరేట్ పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, టర్మ్ ఫీజు, డెవలప్‌మెంట్ ఫీజు, యాక్టివిటీ ఫీజు, స్మార్ట్ క్లాస్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, పరీక్షల ఫీజు, ట్రాన్స్‌పోర్ట్ ఫీజు, బిల్డింగ్ ఫండ్, మెయింటెనెన్స్ ఛార్జీలు, ప్రత్యేక శిక్షణ ఫీజు వంటి పేర్లతో అదనపు వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఫీజులు కొన్ని వేల రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు ఉంటున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండే ప్రముఖ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై సంవత్సరానికి భారీ మొత్తం ఖర్చు అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీజులతో పాటు పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, షూస్, బెల్టులు, టైలు, బ్యాగులు, స్టేషనరీ సామగ్రి వంటి వస్తువులను కూడా యాజమాన్యం సూచించిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే వస్తువులను రెండింతలు లేదా మూడింతల ధరలకు విక్రయిస్తున్నారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. దీంతో ఒక విద్యార్థి చదువు కోసం కుటుంబాలు లక్ష రూపాయలకు మించి ఖర్చు చేయాల్సి వస్తోందని అంటున్నారు. పిల్లలకు మంచి భవిష్యత్తు కల్పించాలనే ఆశతో తల్లిదండ్రులు అప్పులు చేసి, బంగారం తాకట్టు పెట్టి, వ్యక్తిగత రుణాలు తీసుకుని ఫీజులు చెల్లిస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని పలువురు చెబుతున్నారు. ఒక కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు ఉంటే వారి చదువుల ఖర్చు మరింత పెరిగి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. మరోవైపు కొన్ని విద్యాసంస్థలు అవసరమైన అనుమతులు, గుర్తింపులు లేకుండానే కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తి స్థాయి అనుమతులు లేకుండానే అడ్మిషన్లు చేపట్టడం, కొత్త బ్రాంచ్‌లు ప్రారంభించడం, విద్యార్థులను చేర్చుకోవడం వంటి చర్యలు జరుగుతున్నాయని సమాచారం. అయినప్పటికీ సంబంధిత అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఫీజులు ఆలస్యమైన విద్యార్థులను తరగతులకు అనుమతించకపోవడం, పరీక్షలకు దూరంగా ఉంచడం, హాల్ టికెట్లు ఇవ్వకపోవడం వంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెంచే చర్యలు పిల్లల విద్యాభ్యాసంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని విద్యావేత్తలు కూడా అభిప్రాయపడుతున్నారు. విద్యా హక్కు చట్టం, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు, గుర్తింపు ప్రమాణాలు అమల్లో ఉన్నప్పటికీ వాటి అమలుపై సరైన పర్యవేక్షణ లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఫీజులు పెరుగుతున్నప్పటికీ వాటిని నియంత్రించేందుకు సమర్థవంతమైన వ్యవస్థ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మార్పు కనిపించడం లేదని పలువురు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యాసంస్థలపై వేగంగా విచారణ జరిపి, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. విద్యారంగంలో పారదర్శకత కోసం ప్రతి పాఠశాల తన ఫీజుల నిర్మాణాన్ని బహిరంగంగా ప్రకటించే విధానం అమలు చేయాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఏ అంశానికి ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో స్పష్టంగా వెల్లడించే వ్యవస్థ ఉంటే తల్లిదండ్రులకు అవగాహన పెరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా తల్లిదండ్రుల ఫిర్యాదులను స్వీకరించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలు, హెల్ప్‌లైన్‌లు, ఆన్‌లైన్ ఫిర్యాదు వ్యవస్థలు ఏర్పాటు చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులపై నిర్దిష్ట గడువులో విచారణ జరిపి చర్యలు తీసుకుంటే పరిస్థితి మెరుగుపడుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వం విద్యను అందరికీ అందుబాటులో ఉంచే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని, మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, డిజిటల్ సదుపాయాలు, ఆంగ్ల మాధ్యమ బోధన వంటి అంశాలను విస్తరించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం అయితే కార్పొరేట్ విద్యాసంస్థలపై ఆధారపడే పరిస్థితి కొంతవరకు తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. తల్లిదండ్రులు కూడా పాఠశాల ఎంపికలో ప్రకటనలకే పరిమితం కాకుండా గుర్తింపు, బోధన నాణ్యత, ఉపాధ్యాయుల అర్హతలు, ఫీజుల నిర్మాణం, భద్రతా ప్రమాణాలు వంటి అంశాలను పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే పాఠశాలలు కూడా తల్లిదండ్రులను భాగస్వాములుగా భావించి పారదర్శకంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు. దానిని వ్యాపారంగా మార్చడం సమాజానికి మంచిది కాదని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి ఫీజుల నిర్మాణాన్ని సమీక్షించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రత్యేక విశ్లేషణ: వి. విష్ణుమూర్తి




# బోనాల పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన వడ్ల మధుసూదన్ చారి



(ఆగస్టు -8- హంస కలంవార్త)

తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక సంప్రదాయాలకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ హంస కలంవార్త చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వడ్ల మధుసూదన్ చారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ ప్రజల భక్తి, విశ్వాసం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని అన్నారు. అమ్మవారిపై అచంచలమైన భక్తితో నిర్వహించే ఈ వేడుకలు సమాజంలో ఐక్యత, సామరస్యం, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్ర ప్రజల జీవితాల్లో శాంతి, సుభిక్షం నెలకొనాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ పవిత్ర సందర్భంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు, ఫోటో జర్నలిస్టులు, పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, వైద్యులు, సామాజిక సేవకులు, వ్యాపారవేత్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, పాఠకులు, ప్రకటనదారులు మరియు తెలంగాణ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య బోనాల వేడుకలను ఘనంగా జరుపుకోవాలని, అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఇంటిపై నిలిచి అందరికీ సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

**- వడ్ల మధుసూదన్ చారి**
**చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్**
**హంసకలం వార్త**



# సెక్రటేరియట్‌లో మైనింగ్ సమస్యలపై ఉన్నతస్థాయి సమీక్ష చిన్న కాంట్రాక్టర్లపై భారీ పెనాల్టీలు సరికాదు -- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి





( ఆగస్టు -7- హంస కలంవార్త )

రాష్ట్రంలో రోడ్ల నిర్మాణ పనులకు అవసరమైన మైనింగ్ అనుమతులు, చిన్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై శుక్రవారం సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సంయుక్తంగా ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డి, టీజీఎండీసీ ఎండీ అనుదీప్ దురిశెట్టి, ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజినీర్ బి.వి. రావు (హ్యామ్ రోడ్లు), మైనింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, రోడ్ల నిర్మాణ పనులు చేపట్టే చిన్న కాంట్రాక్టర్లపై మైనింగ్ అధికారులు పదిరెట్ల వరకు పెనాల్టీలు విధించడం సమంజసం కాదన్నారు. రూ.5 కోట్ల పనికి రూ.54 కోట్ల పెనాల్టీ విధించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోకుండా, నిబంధనల ప్రకారం పనులు చేస్తున్న చిన్న కాంట్రాక్టర్లను వేధించడం తగదన్నారు. ఇటీవల కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి, మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హ్యామ్ మోడల్ ద్వారా అత్యున్నత ప్రమాణాలతో రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించామని, 2028 ఆగస్టు నాటికి అన్ని పనులు పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ పనులకు అవసరమైన ఇసుక, మట్టి, మెటల్ వంటి నిర్మాణ సామగ్రి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, మెటల్ పర్మిషన్ల పేరుతో కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టవద్దని మైనింగ్ అధికారులను ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి లేవనెత్తిన అంశాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి వివేక్ వెంకటస్వామి, చిన్న కాంట్రాక్టర్ల సమస్యలను సానుభూతితో పరిశీలించి, అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం కావడంతో పాటు కాంట్రాక్టర్లకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గుతాయని సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం.

# ప్రగతి నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి





(ఆగస్టు- 7- హంస కలంవార్త )

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 276వ డివిజన్ ప్రగతి నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి (తాతిరెడ్డి) జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి, బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డికి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొంటూ, ప్రజలకు మరింత సేవ చేసేలా ఆయురారోగ్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, డివిజన్ అధ్యక్షుడు కొలన్ జీవన్ రెడ్డి, వరగాని వాసు, షేక్ రఫియా బేగం, రమేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఎస్సీ సెల్‌కు నూతన నియామకాలు





-నియామక పత్రాలు అందజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి

( ఆగస్టు- 7- హంస కలం వార్త )

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్‌కు నూతనంగా నియమితులైన నాయకులు శుక్రవారం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఎస్సీ సెల్ నాయకులకు కొలన్ హన్మంత్ రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లి, ఎస్సీ సెల్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులకు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని పొందేలా సేవాభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు బొట్ల విజయ్ కుమార్, సెక్రటరీ కావలి బాల సాయిరామ్, జనరల్ సెక్రటరీ యెర్రోళ్ల మనోహర్, బి-బ్లాక్ అధ్యక్షుడు సల్మాన్ రాజు, డివిజన్ అధ్యక్షులు జె. శరత్ కుమార్, గూడ్ల అనిల్ కుమార్, గజ్జెల్లి మల్లికార్జున్, బండారి సంగ్రామ్, ఎం. అజయ్ కుమార్, మోత్కూరి అరుణ్ కుమార్, తోకల శ్రీను, అవిజె హనుమంత్, కుసుమ శ్యామ్ బాబు, గుడ్డేటి రాజు, సాయిదావులు శ్రీనివాస్, బొద్దులోల్లు రంగయ్య, కుమ్మరి రాజు, గడ్డం ప్రసన్న కుమార్, కడం రాహుల్, గొల్లపూడి రాము, నీరుడి ప్రభాకర్, చింతకింది సురేష్, చెవిటి శ్రీనివాస్‌తో పాటు జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావలి చెన్నయ్యా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల పక్షాన బి ఆర్ ఎస్ పోరాటం కొనసాగుతుంది: ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు



( ఆగస్టు -7- హంస కలంవార్త )

ఎమ్మెల్సీ శంభిపూర్ రాజును ఘనంగా సత్కరించిన యువజన నాయకులువిద్యార్థులు, యువత, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం భారత రాష్ట్ర సమితి ( టిఆర్ఎస్) పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని టిఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు అన్నారు. టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) పిలుపు మేరకు నిర్వహించిన యువ సంగ్రామ సభను విజయవంతం చేయడంతో పాటు, నీట్ పేపర్ లీకేజ్ అంశంపై విద్యార్థుల ఉద్యమానికి మద్దతుగా హైదరాబాద్ ఇంద్రాపార్క్ ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నాను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించినందుకు ఎమ్మెల్సీ శంభిపూర్ రాజును యువజన నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలతో పాటు విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. విద్యార్థులు, యువత హక్కుల పరిరక్షణ విషయంలో టిఆర్ఎస్ పార్టీ ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు.అనంతరం మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, సురేష్ రెడ్డిలతో కలిసి పార్టీ భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై చేపట్టనున్న ఉద్యమాలు, బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసే వ్యూహాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, సీఎంసీ డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, విజయ్ రామ్ రెడ్డి తదితరులు పాల్గొని ఎమ్మెల్సీ శంభిపూర్ రాజును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు టిఆర్ఎస్ యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ నల్లపోచమ్మ దేవాలయ 9వ వార్షికోత్సవ మహోత్సవంలో టీపీసీసీ నేత మొహమ్మద్ జాకీర్ పాల్గొన్నారు



(ఆగస్టు -7- హంస కలంవార్త )

285 పద్మనగర్ డివిజన్ పరిధిలోని సంజీవయ్య నగర్ కాలనీ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ దేవాలయం 9వ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్, డీసీసీ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి మొహమ్మద్ జాకీర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మొహమ్మద్ జాకీర్ కి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన భక్తులను పలకరించి బోనాల ఉత్సవాల వైభవాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగార్జున్ రావు భూషణం ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449